తమ్ముళ్ల నీటి రాజకీయం



- మినరల్ వాటర్ ప్లాంట్‌ను మూసేసిన టీడీపీ నేతలు
- పంచాయతీ మోటర్ ఫ్యూజులను తొలగించిన గుర్తు తెలియని వ్యక్తులు
- తాగునీటి కోసం పులగుట్టపల్లి పెద్దతండా గ్రామస్తుల ఆందోళన



టీడీపీ నాయకులు మూసివేసిన వాటర్ ప్లాంట్ వద్ద నిరసనకు దిగిన పులగుట్టపల్లి తండావాసులు

గుంతకల్లు రూరల్: గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌ను టీడీపీ నేతలు మూసేశారు. దీనికితోడు గ్రామ పంచాయతీ బోరుకు సంబంధించిన ఫ్యూజులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో పులగుట్టపల్లి పెద్దతండా గ్రామస్తులు నీటి సమస్యతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని గ్రామంలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. 150 పైగా కుటుంబాలు, 700 పైగా జనాభా కలిగిన పులగుట్టపల్లి పెద్ద తండాలో గతంలో దాత స్థలంలో ప్రభుత్వ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను శీనా నాయక్ అనే వ్యక్తికి అప్పజెప్పారు. కొంతకాలం పాటు ప్లాంట్‌ను నిర్వహిస్తూ వచ్చిన శీనానాయక్ ఆ తరువాత నిర్వహణ కష్టతరంగా మారడంతో బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఆ తరువాత గత వైఎస్సార్‌సీపీ హయాంలో సర్పంచ్ పార్వతి భర్త వెంకటేష్ నాయక్ సొంత ఖర్చుతో ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టి గ్రామస్తులకు తిరిగి శుద్ధజల పంపిణీని ప్రారంభించాడు. అప్పటి నుంచి ప్లాంట్ నిర్వహణ బాధ్యతలు ఆయనే చూసుకుంటూ వచ్చాడు. ఇటీవల కూటమి ప్రభుత్వం కొలువయ్యాక గ్రామంలోని టీడీపీ నాయకులు మినరల్ వాటర్ ప్లాంట్‌ను సొంతం చేసుకున్నారు. ప్లాంట్ మరోసారి మరమ్మతులకు గురైంది. మరమ్మతులకైన ఖర్చు రూ.71 వేలు గ్రామ పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలంటూ సర్పంచ్‌పై టీడీపీ నాయకులు ఒత్తిడి పెంచారు. ప్లాంట్‌ను నిర్వహించే వ్యక్తులే దాని ఖర్చులు, రాబడి అన్ని చూసుకోవాల్సి ఉంటుందని, ప్లాంట్‌ను మీరు నిర్వహిస్తూ మరమ్మతుల డబ్బులు పంచాయతీ నుంచి చెల్లించాలని డిమాండ్ చేయడం సరికాదని ఆమె తెలిపారు. దీంతో టీడీపీ నేతలు ఏకంగా ప్లాంట్‌ను మూసి వేసి మరమ్మతులకు అయిన ఖర్చు మొత్తాన్ని ఇవ్వాల్సిందేనని భీష్మించారు. గ్రామంలోని ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరమ్మత్తులకు అయిన ఖర్చులో రూ.30 వేలు చెల్లించేందుకు సర్పంచ్ ముందుకు వచ్చారు. అందుకు ససేమిరా అన్న టీడీపీ నాయకులు తాము అడిగినంత చెల్లించేదాకా ప్లాంట్‌ను తెరిచే ప్రసక్తే లేదని వారం రోజులుగా ప్లాంట్‌కు తాళాలు వేశారు. దీంతో ప్రజలు తాగునీటి అవసరాలను తీర్చుకునేందుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పులగుట్టపల్లి వరకూ వెళ్లి శుద్ధ జలాన్ని తెచ్చుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు.

పంచాయతీ బోరు ఫ్యూజుల తొలగింపు

తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్న పులగుట్టపల్లి పెద్దతండా ప్రజలకు సోమవారం ఉదయం మరో సమస్య ఎదురైంది. గ్రామానికి నీటిని సరఫరా చేసే బోరు కు సంబంధించిన ఫ్యూజులను సోమవారం తెల్లవారేలోపు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో గ్రామానికి నీటి సరఫరానే లేకుండా పోయింది. తాగునీటి మాట అటుంచితే ఇంట్లో వాడుకోవడానికి కూడా చుక్కనీరు లేని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

మూడు కిలోమీటర్లు వెళ్లాలి



గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ మూత పడటంతో శుద్ధ జలం కోసం నిత్యం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పులగుట్టపల్లి గ్రామం వరకూ వెళ్లాల్సి వస్తోంది. అక్కడ ప్లాంట్ నిర్వాహకులు ప్లాంట్‌లోని నీరు వారి గ్రామస్తులకే సరిపోవడం లేదని మమ్మల్ని తిప్పి పంపుతున్నారు. వారిని ఎలాగోలా బతిమలాడి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నా మాకీ దుస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

– రామాంజనేయులు నాయక్, పులగుట్టపల్లి పెద్దతండా

డబ్బు కోసం ఒత్తిడి చేస్తున్నారు



ఇటీవల ప్రభుత్వం మారాక గ్రామంలోని టీడీపీ నాయకులు వాటర్ ప్లాంట్‌ను సొంతం చేసుకుని నిర్వహిస్తున్నారు. మధ్యలో రిపేరీ వచ్చిందని, మరమ్మతులకు అయిన డబ్బు పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలని గత కొద్దిరోజులుగా నాపై విపరీతమైన ఒత్తిడి చేస్తున్నారు. ప్లాంట్‌ను నిర్వహిస్తూ వచ్చిన డబ్బును తీసుకుంటున్న నాయకులు, రిపేరీకి మాత్రం పంచాయతీ నిధులను డిమాండ్ చేయడం సరికాదంటే ఏకంగా ప్లాంట్‌నే మూసివేశారు.

– పార్వతి, సర్పంచ్

పంచాయతీ నిధులు వాడటం వీలుకాదు



ప్లాంట్ నిర్వహణ అనేది పూర్తిగా వ్యక్తిగతం. ఎవరైతే ప్లాంట్‌ను నిర్వహిస్తారో మరమ్మత్తుల బాధ్యత కూడా వారే భరించాల్సి ఉంటుంది. కానీ ప్లాంట్ మరమ్మతులకు పంచాయతీ నిధులను మంజూరు చేయడం కుదరదు. గ్రామ పంచాయతీ బోరు మోటర్‌కు అమర్చిన ఫ్యూజులను ఎత్తుకెళ్లిన విషయం తెలియగానే పంచాయతీ కార్యదర్శిని గ్రామానికి పంపి సమస్యను పరిష్కరించాం.

– నాగభూషణం, ఈవోఆర్డీ గుంకతల్లు మండలం

ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ సోమవారం తెలిపారు. రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడుకేషన్ అండ్ రీసెర్చ్ (అటానమస్)లో నిర్వహించిన ఇన్నోవేషన్ ఎక్స్‌పోలో కళాశాలకు చెందిన జయక్రిష్ణ బెస్ట్ ఇన్నోవేషన్ మోడల్ అవార్డును అందుకున్నారన్నారు. అలాగే అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎస్ కోసం న్యూక్లియర్ బ్యాటరీస్ ఎ న్యూహారిజన్ ఆఫ్ సస్టైనబుల్ మొబిలిటీ అనే అంశంపై పేపర్ ప్రెజెంటేషన్‌లో కుశాంత్‌కుమార్ మొదటి బహుమతి సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అధిపతి డాక్టర్ మేరీ మాత అభినందించారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



పెద్దవడుగూరులో పాదయాత్ర పోస్టర్లు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

పెద్దవడుగూరు/పామిడి: రైతులు పండించే పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల నాయకులు దస్తగిరి, అనిమిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పెద్దవడుగూరులోని ఉమామహేశ్వర స్వామి ఆలయం వద్ద 2024–25 ఖరీఫ్, రబీ లో పంట నష్టపోయిన రైతులకు బీమా ప్రకటించాలని, గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ ఉరవకొండ నుంచి కలెక్టరేట్ వరకూ చేపట్టనున్న పాదయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువైన అనంతరం ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధర లేదన్నారు. ఈ నెల 7 నుంచి పాదయాత్ర చేపడతామని 10వ తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. మిరప, పత్తి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. సీపీఎం, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే పామిడి మండలంలోని గజరాంపల్లిలో పాదయాత్ర పోస్టర్లు విడుదల చేశారు. రైతుసంఘం నాయకులు పీ అనిమిరెడ్డి, మల్లేష్, రైతులు మూరుతిప్రసాద్‌రెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తాడిపత్రిటౌన్/తాడిపత్రి రూరల్: పట్టణంలోని బంకమట్టి వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు, కిశోరబాలికలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సూపర్‌వైజర్ దస్తగిరమ్మ హాజరై బాల్య వివాహాలు వాటి అనర్థాలను వివరించారు. అనంతరం కాలనీలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతమ్మ, రమాదేవి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు. అలాగే మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా తాడిపత్రి పట్టణ సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన నిర్వహించారు. అలాగే సైబర్ మోసాలకు గురైన వారు 1930 నెంబర్‌కు కాల్ చేయాలంటూ సైబర్ సురక్ష పేరుతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్ ఉషారాణికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

పెద్దవడుగూరు: అంగన్‌వాడీ వర్కర్ల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని జిల్లా మండల అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శకుంతల, తాడిపత్రి ప్రాజెక్ట్ లీడర్లు జ్యోతిలత, గోవిందమ్మ, సీఐటీయూ మండల నాయకులు దస్తగిరి, మద్దిలేటి డిమాండ్ చేశారు. ప్రతి నెలా 1న అంగన్‌వాడీ వర్కర్లకు వీహెచ్ఎస్ఎన్‌డీ కార్యక్రమం నిర్వహిస్తుండడంతో అధికంగా పని ఉంటుంది. కొంతమందికి పింఛన్ల పంపిణీ చేయడం కోసం అదనపు బాధ్యతలు అప్పగించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమను పింఛన్ల పంపిణీ ప్రక్రియ నుంచి తప్పించాలని కోరారు. మహిళలని చూడకుండా అంగన్‌వాడీ కార్యకర్తలను అప్పేచర్ల పంచాయతీ కార్యదర్శి నానా దుర్భాషలాడారని ఆరోపించారు. పంచాయితీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఉషారాణి, ఈఓఆర్‌డి నరసింహారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మండల అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

'వరికి హెచ్చెల్సీ నీరు కొనసాగించాలి'

గార్లదిన్నె: మండలంలోని మిడ్ పెన్నార్ డ్యాం నుంచి దక్షిణ కాలువ ద్వారా ఆయకట్టు పంటలకు అందిస్తున్న సాగునీరు కొనసాగించాలని రాయల సీయ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పిన మేరకు 150 రోజులు పూర్తి కాకనే హెచ్చెల్సీ అధికారులు సాగు నీరు బంద్ చేయడంతో కాలువ కింద సాగు చేసిన వరి పంట పొట్ట దశలో ఉండి ఎండిపోతోందన్నారు. ఇంకా నెల రోజులు సాగు నీరు అందించి వరి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కూడా వ్యవసాయానికి అరకొర నిధులు కేటాయించారన్నారు. తొమ్మిది నెలలు గడుస్తున్న సూపర్ సిక్స్ పథకా లు అమలు చేయడం లేదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో రాయల సీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, తాతిరెడ్డి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

11న మండల సమావేశం

శింగనమల: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 11న ఎంపీపీ యోగేశ్వరి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలన్నారు. సమావేశంలో మండల సమస్యలపై చర్చించనున్నందున , అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెద్దవడుగూరు(పెద్దపప్పూరు): మండలంలోని చిక్కేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ నరసింహులు సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మండల ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

పీఆర్‌టీయూ హర్షం

తాడిపత్రిటౌన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసుల నాయుడు విజయంపై తాడిపత్రి పీఆర్‌టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వారు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. శ్రీనివాసులనాయుడు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు రంగస్వామి, రాజశేఖర్‌రెడ్డి, ధనుంజయనాయుడు, గోపాల్‌రెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి, పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్ ఓపెన్ టోర్నీలో ప్రతిభ



గ్లాడ్ స్టోన్‌కు కప్ అందజేస్తున్న నిర్వాహకులు

గుత్తి: గుంతకల్లులో మూడు రోజులుగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ లాన్ టెన్నిస్ టోర్నీలో గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన టెన్నిస్ కోచ్ శామ్యూల్ కుమారుడు గ్లాడ్ స్టోన్ అత్యంత ప్రతిభ కనబరిచాడు. పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. సింగల్, డబుల్స్‌లో షఫీ అనే క్రీడాకారుడితో కలిసి రన్నర్స్ ట్రోఫీ సాధించారు. రెండు ఈవెంట్‌లలో ప్రతిభ కనబరిచి రన్నర్స్ సాధించినందుకు టోర్నీ నిర్వాహకులు కప్, మెమొంటోలు ప్రదానం చేశారు.

నాటుసారాతో ప్రాణాలకు ముప్పు

గుంతకల్లు రూరల్: నాటుసారా తాగడం వల్ల ప్రాణాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని, నాటుసారాకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య సూచించారు. సోమవారం గుంతకల్లు మండలంలోని కదిరిపల్లిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయ 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా సేవించడం వల్ల అనేక అనర్థాలు కలిగే ప్రమాదం ఉన్న నేపథ్యంలో నాటుసారా తయారు చేసే గ్రామాలు, విక్రయించే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నాటుసారాకు వ్యతిరేకంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న, వదినపై దాడి

పామిడి: మండలంలోని రామరాజపల్లిలో అన్న, వదినలపై భోగాతి సుధాకర్‌రెడ్డి, ఆయన అనుచర వర్గం కత్తులు, కట్టెలతో దాడి చేసి గాయపరిచడంపై సీఐ వీ యుగంధర్ సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు సోదరులైన భోగతి హనుమంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి మధ్య కొన్నేళ్లుగా తగాదాలు ఉన్నాయి. గతంలో వారిపై బైండోవర్ కేసులు నమోదయ్యాయి. అయినా వారి మధ్య తరుచూ తగాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తమ్ముడు సుధాకర్‌రెడ్డి తన అన్న హనుమంతరెడ్డితో పాటు ఆయన మరదలు, రెండో తమ్ముడి భార్య అనుసూయపై ఐదుగురు అనుచర్గ వర్గంతో దాడికి పాల్పడ్డాడు. దాడిలో హనుమంతరెడ్డి, అనసూయ గాయపడ్డారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పామిడి: మండలంలో త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం ఫాల్గుణ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని భగవద్గీత ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని గజరాంపల్లి, ఎదురూరు, అక్కజాంపల్లితో పాటు మిడుతూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఫాల్గుణ మాసం, హోలీ పౌర్ణమి పండుగల విశిష్టతపై వారు ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ సమితి గుత్తి కమిటీ అధ్యక్షుడు రవికుమార్, సభ్యులు బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, రావు, రామాంజనేయులు, మధు, రాజారావు, సురేష్, మాధవరెడ్డి, వెంకటేష్, వాణి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

పామిడి: మండలంలోని రామగిరి గ్రామానికి చెందిన బోయ ఈశ్వరయ్య భార్య వైశాలి(32) ఆత్మహత్య చేసుకుంది. కొంత కాలంగా మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆమె సోమవారం రాత్రి 7.45 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గవాచీకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను పరామర్శించిన కేతిరెడ్డి



వైవీఆర్‌తో మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: హైదరాబాద్‌లో సర్వైకల్ సర్జరీ చేయించుకుని ఇటీవల గుంతకల్లుకు విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. సోమవారం వైవీఆర్ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు స్థానిక రాజకీయాలపై చర్చించారు. కేతిరెడ్డితో పాటు నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు వైవీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

చెస్ టోర్నీ విజేత బాలాజీ



బాలాజీని అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ఆదోనిలో ఈ నెల 2న నిర్వహించిన ఏపీ స్టేట్ అండర్–16 ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో పట్టణంలోని మాంటిస్సోరి స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి బాలాజీ ప్రతిభను కనబరిచి విజేతగా నిలిచాడు. 6/6రౌండ్స్‌లో బాలాజీ 6 పాయింట్లు సాధించి టైటిల్‌ను దక్కించుకున్నట్లు కోచ్‌లు అనిల్‌కుమార్, రామారావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలాజీని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి శివారులో సోమవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి జయరాజ్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గుంతకల్లుకు చెందిన జయరాజ్ పని నిమిత్తం గుత్తికి వచ్చి అక్కడి నుంచి కర్నూలు జిల్లా ఆలూరుకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. బసినేపల్లి శివారులో మలుపు వద్ద వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ స్థలాలకు కంచె ఏర్పాటు



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ఉన్న మున్సిపల్ రిజర్వ్‌డ్ స్థలానికి సిమెంట్ పిల్లర్స్‌తో కూడిన ఇనుపకంచె ఏర్పాటుకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని సోమవారం భూమిపూజ చేశారు. పట్టణంలోని ఆరు ప్రదేశాల్లో మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించేందుకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నయీమ్ అహ్మద్, టీడీపీ నాయకుడు నారాయణస్వామి, కౌన్సిలర్ నీలావతి, ఎంఈ కృష్ణప్రసాద్, ఏసీపీ శ్రీనివాస్, టీపీఎస్ అబ్దుల్‌సత్తార్, ఏఈ హరిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారితో వైద్యులు

పెద్దవడుగూరు(పెద్దపప్పూరు): పెద్దపప్పూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి, భారత్‌గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు ఆర్.వీరారెడ్డి తెలిపారు. కర్నూలు శాంతిరామ్ కంటి వైద్యనిపుణుడు డాక్టర్ జగదీష్ కంటి పరీక్షలు నిర్వహించారన్నారు. వివిధ గ్రామాల నుంచి వంద మందికి పైగా రోగులు శిబిరానికి హాజరు కాగా 30 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారని వారు తెలిపారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని వరు తెలిపారు. కార్యక్రమంలో షబానా. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల వసూలుకు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా ఆధ్వర్యంలో అధికారులు, సచివాలయ సిబ్బంది సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఓల్డ్ సీపీఐ కాలనీ, గాంధీ నగర్, చెర్లోపల్లి, కుమ్మర వీధి, ఉప్పర వీధిలో పర్యటించి రూ.నాలుగు లక్షల మేర ఇంటి పన్ను బకాయిలను వసూలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఓ సతీష్ కమలాకర్, మేనేజర్ రాంబాబు, ఆర్‌ఐ షెక్షావలి, అడ్మిన్లు వినయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

గుత్తి: మున్సిపల్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. రూ.1.90 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే భవన నిర్మాణం పనులను ప్రారంభిస్తామన్నారు.

సజావుగా టెంకాయల వేలం

యాడికి: మండల కేంద్రంలో చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించే శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో టెంకాయల విక్రయ హక్కు కోసం సోమవారం నిర్వహించిన వేలం రూ.2,40,116లు పలికిందని ఈఓ దుర్గా ప్రసాద్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన టెంకాయల వేలం పాటలో 9 మంది పోటీ పడగా పెద్దపప్పూరు మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన హరినాథ రెడ్డి రూ2,40,116 కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు టెంకాయ రూ50కు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఈఓ హెచ్చరించారు. కార్యక్రమంలో అర్చకుడు హరికృష్ణ శర్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న 92 మంది విద్యార్థులకు ఎస్ఐ ఆంజినేయులు పరీక్ష సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్య సాధన కోసం పక్కా ప్రణాళికతో చదవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు అట్టలు, పెన్నులు తదితర సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామ వార్డు సభ్యురాలు భారతి మామ రామాంజనేయులు సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గౌడ్, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి నాగేష్, మోటుపల్లి రవి, శివయ్య, రసీదు, మధు, ఆదినారాయణ రెడ్డి, రంగ, హనుమంతరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారతి, మహేంద్ర దంపతులను పరామర్శించారు.

22 మంది విద్యార్థుల గైర్హాజరు



గుత్తి మోడల్ స్కూల్ వద్ద ఇంటర్ విద్యార్థులను చెక్ చేసి లోపలికి పంపుతున్న దృశ్యం

గుత్తి/పామిడి: గుత్తి పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో సోమవారం ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు ప్రారంభయ్యాయి. మొత్తం 750 మంది విద్యార్థులకు గాను 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ తెలుగు, సంస్కృతానికి సంబంధించి పరీక్షలు నిర్వహించారు. అలాగే పామిడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 298 మంది విద్యార్థులకు గాను 292 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలకు చీఫ్‌గా ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా పామిడి మోడల్‌స్కూల్ ఉపన్యాసకులు రమేష్ వ్యవహరించారు. పరీక్ష కేంద్రం వద్ద సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బీఆర్ ప్రసాద్, పోలీసులు బందోబస్తు చేపట్టారు.